ఇంటర్.. తంటాల్.!

• మేడ్చల్ నియోజకవర్గానికి ఒకే ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల • ప్రైవేట్‌లో చదివించలేకపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
• మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇంటర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్



ఘట్‌కేసర్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఏబీవీపీ విద్యార్థుల నిరసన (ఫైల్)

ఘట్‌కేసర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవాలని కలలు కంటున్న పేద విద్యార్థుల ఆశలు అడియాశలు అవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు స్థానికంగా జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రైవేటు కళాశాలలో ఫీజులు చెల్లించే స్తోమత లేని పేద తల్లిదండ్రులు సతమతం అవుతున్నారు. యువకులు దుకాణాలు, మెకానిక్ షెడ్లలో పని చేసకుంటుండగా యువతులు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మిగిలిన వారు చెడు వ్యసనాలకు అలవాటుపడి సంఘ వ్యతిరేకులుగా తయారవుతున్నారు.

ఊసెత్తని ప్రజాప్రతినిధులు...

నియోజకవర్గంలో ఘట్‌కేసర్, పోచారం, దమ్మాయిగూడ, నాగారం, తూంకుంట మున్సిపాలిటీలు, కీసర, మూడుచింతలపల్లి మండలం, పీర్జాదిగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేదు. మేడ్చల్‌లో ఉన్న కళాశాలకు వెళ్లాలంటే దూరభారంతో విద్యార్థులు చదువు మానేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏటా పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న వేలాది మంది పేద విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదివించలేకపోతున్నారు. పదితో పాటు ఇంటర్ కూడా ప్రభుత్వ కళాశాలలో చదివించొచ్చని ఆశించిన తల్లి తండ్రులకు నిరాశే ఎదురవుతోంది. నగరానికి వెళ్లి చదువుకునే స్తోమత లేక మధ్యలోనే ఆపేస్తున్నారు.

◆ ఎన్నికల సమయంలో జూనియర్ కళాశాల ఏర్పాటుపై నాయకులు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగానే మిగిలిపోతున్నాయి. గ్రామాలు పట్టణాలుగా అభివృద్ధి చెందిన, వ్యాపారాలు జోరందుకున్న విద్యారంగం మాత్రం అలాగే ఉండిపోతోంది. నాయకులు వేదికలపై ఉపన్యాసాలు ఇవ్వడమే కాని చిత్తశుద్ధితో పని చేయడం లేదని పేదలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు పదవుల మీద ఉన్న ధ్యాస విద్యారంగం అభివృద్ధిపై చూపడం లేదని విమర్శిస్తున్నారు. పెరుగుతున్న నగరీకరణ, పెరిగిన జనాభా అనుగుణంగా ప్రభుత్వ విద్యాసంస్థలను పెంచాలని కోరుతున్నారు. నగరంలోకి వెళ్లి చదవలేని పేద విద్యార్థుల చదువుపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యారంగంపై చిన్నచూపు..



పదో తరగతి ఉత్తీర్ణులవుతున్న విద్యార్థులకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. రాజకీయం మీదున్న ధ్యాస నాయకులు విద్యారంగంపై లేకుండాపోతోంది. పేద విద్యార్థుల చదువుపై నాయకులు చిన్నచూపు చూపుతున్నారు. అందరికీ ఇంటర్ విద్య అందుబాటులోకి తేవాలి.

–అంకం శ్యామ్‌కిరణ్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి...



పదో తరగతి వరకు ఉచితంగా చదువుకున్న పేద విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో చదవలేకపోతున్నారు. ప్రైవేటు కళాశాలలో ఫీజులు చెల్లించలేక తమ చదువును నిలిపివేస్తున్నారు. స్థానికంగా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి.

– క్లెం శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకుడు

చలనం లేదు...



ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఉద్యమం చేపట్టిన ప్రభుత్వంలో చలనం రావడం లేదు. అన్ని ప్రాంతాల్లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి. పాలకులు హామీలిస్తున్నారు. కాని అవి అమలుకు నోచుకోవడం లేదు.

–సంతోశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ధృవలో 6,7 తేదీల్లో 'ముఖాబులా'

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని ధృవ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జాతీయ స్థాయిలో ప్రతి యేటా నిర్వహించే ముఖాబులా కార్యక్రమాన్ని ఈ నెల 6,7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. దేశంలోని అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్‌లోని ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులకు డ్యాన్స్, సింగింగ్, క్విజ్, ఫొటోగ్రఫీ, స్పీచ్, ఐపీఎల్ బిడ్డింగ్, రంగోలి, ఫ్యాషన్ షో తదితర పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కీసర ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



కీసర: కీసర పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కస్తూరాజు శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం కీసర పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతనాగరాజు, బీఆర్ఎస్ నేతలు గండి అంజయ్యగౌడ్, వరకాల పెంటయ్య, గూడురు ఆంజనేయులు గౌడ్ తదితరులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న వజ్రేశ్ యాదవ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన సద్ది వెంకటరెడ్డి అనారోగ్యంతో చికిత్స చేసుకోగా, అతడికి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేశ్ యాదవ్ అందజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బాపురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం


గోల్డ్ మెడలిస్ట్ మానసను సత్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ పరుశురాం, ఎస్సైలు

ఘట్‌కేసర్: కరీంనగర్‌లో జరిగిన స్టేట్ లెవల్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ జి మానస కబడ్డీలో గోల్డ్ మెడల్, ఆమ్స్ రెజ్లింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరుశురాం పోలీస్ స్టేషన్‌లో ఆమెను శాలువాతో సత్కరించి మెడల్స్, ప్రశంసా పత్రం అందజేశారు. అనంతరం ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, నరసింహ, శేఖర్, ఇంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు.

బీజేపీ రాష్ట్ర సభ్యుడిగా అచ్చిని నర్సింహ



పోచారం: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన అచ్చిని నర్సింహ నియమితులయ్యారు. రెండోసారి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నర్సింహను ఎన్నుకోవడం పట్ల స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ..పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

రుణం పేరుతో టోకరా

రూ. 32,050 వసూలు

ఘట్‌కేసర్: రుణం మంజూరైందని రూ.32,050 కాజేసిన సంఘటనపై ఘట్‌కేసర్ పోలీసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఘనాపూర్ గ్రామానికి చెందిన మహేందర్‌కు గత నెల 26న గుర్తు తెలియని నెంబర్ నుంచి ఒక లింకు వచ్చింది. రుణం మంజూరు కోసం వచ్చిన అప్లికేషన్‌గా భావించి వివరాలు పంపాడు. మర్నాడు మరో నంబర్ నుంచి ఫోన్ రావడంతో మాట్లాడాడు. రుణం మంజూరు అయిందని పీడీఎఫ్ పంపి వారు జీఎస్టీ, పేపర్ వర్క్, ఐటీఆర్ కోసం రూ. 32,050 పంపాలని కోరారు. దీంతో అతను గూగుల్ పే ద్వారా వారికి నగదు బదిలీ చేవాడు. అప్పటి నుంచి పలు మార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి


మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

కీసర: పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించనందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. శివబాబు అన్నారు. మంగళవారం కీసర, చీర్యాల లోని మున్సిపల్ వార్డు కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య సిబ్బంది నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేసిన తర్వాత సిబ్బందికి వేతనాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. కొందరు సిబ్బంది అనారోగ్యంతో బాధపడుతున్నా ఆసుపత్రికి వెళ్లాలంటే డబ్బులు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవి, నారాయణ, రవీందర్, సాయిలు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహప్రతిష్ఠాపనోత్సవంలో కాలనీవాసులు

బోడుప్పల్: శ్రీసాయినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యారణ్య భారతిస్వామి, మాధవానంద సరస్వతి స్వామిజీలు విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాబలి నివేదన, జయాధిహోమాలు, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కలశోద్వాసన, విగ్రహాలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించిన తుప్పత్ ఆనంద్ దంపతులను సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సంతోష్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రఘుగోపాల్‌రావు, విశ్వనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్

కుషాయిగూడ: మనకు అందుబాటులో ఉన్న ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ అన్నారు. మంగళవారం కుషాయిగూడలోని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టులో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో 'నల్సా లీగల్ సర్వీస్ టూ పర్సన్స్ విత్ మెంటల్ హిల్‌నెస్ అండ్ పర్సన్ వి ఇంటలెక్చువల్ డిసెబిలిటీస్ స్కీమ్'పై ఎల్ఎస్‌యూఎం సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. న్యాయవాదులకు మానసిక మనోవ్యాధి, మేధో వైకల్యానికి సంబంధించిన చట్టాలపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సామాన్య ప్రజలను చట్టాలపై చైతన్యపరిచి న్యాయసాయం అందేలా చూడాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ డిసేబుల్డ్ చైర్మన్ గంగారామ్, పాపారావు, రాము, సురేష్, జీవన్, జలజ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల గుర్తు తెలియని మంగళవారం రాత్రి మాధవరెడ్డి రైల్వే బ్రిడ్జ్ సమీపంలో బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. అతడి కుడి చేతిపై (రేజు) అనే పచ్చబొట్టు ఉంది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మొబైల్ షాపులో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పోచారం: అన్నోజిగూడలోని మొబైల్ షాపులో మంగళవారం చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో మంగళవారం తెల్లవారు జామున ఎస్ఎల్ఎన్ మొబైల్ షాపులో చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నించారు. షట్టర్ తెరుచుకోకపోవడంతో పక్కనే ఉన్న ఎంఐ షాపులో చోరీకి పాల్పడ్డారు. ఉదయం షాపు షట్టర్ తెరిచి ఉండటంతో భవన యజమాని షాపు నిర్వాహకుడికి సమాచారం అందించారు. షాపులో రక్తపు మరకలు ఉండటంతో చోరీకి వచ్చిన వారిలో ఒకరి కాలుకు గాయమైనట్లు తెలుస్తోంది. 67 స్మార్ట్ ఫోన్లు, ఎల్ఈడీ టీవీలు, బ్రాండెట్ యాక్సెసరీస్ చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. సంఘటనా స్థలాన్ని క్రైమ్ డీసీపీ అరవింద బాబు పరిశీలించారు. పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్-గండిమైసమ్మ రోడ్డు మూసివేత

మేడ్చల్: అయోధ్య చౌరస్తా వద్ద రైల్వే గేట్ వద్ద ట్రాక్ మరమ్మతుల కారణంగా మేడ్చల్-గండి మైసమ్మ రోడ్డును ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు మూసివేయనున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ తెలిపారు. గేట్ వద్ద ట్రాక్ మరమ్మతులు చేస్తున్నందున రోడ్డును మూసివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మేడ్చల్ నుండి గండి మైసమ్మ కు వెళ్లే వారు ఔటర్‌రింగు రోడ్డు లేదా కొంపల్లి మీదుగా వెళ్లాలని సూచించారు. గండిమైసమ్మ వైపు వచ్చే వారు అయోధ్య చౌరస్తా వరకు వచ్చి అక్కడి నుండి వెళ్ల వచ్చని, మేడ్చల్ నుండి వెళ్లే వారు గొడవెళ్లి చౌరస్తా మీదుగా ప్రయాణించాలని సూచించారు. వాహనదారులు విషయాన్ని గ్రహించాలని ఆయన కోరారు.

ఓటర్ల జాబితాపై అఖిలపక్ష సమావేశం


సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

శామీర్‌పేట్: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం శామీర్‌పేట్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 7 గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సూచనలు తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీఓ మమతాబాయి, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

పోచారం: అన్నోజిగూడ ఫ్లై ఓవర్‌పై మంగళవారం ఓ కారులో మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. సాయికిరణ్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి రాయదుర్గం నుంచి కొమురవెల్లికి కారులో బయలుదేరారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఫ్లైఓవర్‌పై కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్న నలుగురు దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

డిజిటలైజేషన్‌పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



పోచారం: నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటలైజేషన్‌పై మంగళవారం అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాలేజ్ డైరెక్టర్ నల్ల దివ్య మాట్లాడుతూ మారుతున్న విద్యావిధానంతో పాటు ప్రపంచీకరణపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సు శుక్రవారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవంతో ముగుస్తుందన్నారు. ఇండియా, నేపాల్, యూరోపియన్ దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాలతో బోధన, పరిశోధన, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం ఒప్పందం చేసుకున్నామన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను తమ కళాశాలలో ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు.. వేల గొంతులు' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శామీర్‌పేట్: ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల పోరాటం చివరి దశకు చేరుకుందని మూడు చింతలపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నల్ల కృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లిలో లక్ష డప్పులు, వేల గొంతులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా జరుగుతున్న పోరాటం అనేక మలుపులు తిరిగి లక్ష్యానికి చేరుకుందన్నారు. ఈనెల 7న ఎల్బీ స్టేడియంలో జరిగే లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి వేలాదిగా తరలిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల బోధనపై ఆరా

అనురాగ్ స్కూల్‌ను సందర్శించిన డీఎంఈ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఎంఈ శివరాంప్రసాద్

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని మానసిక వికలాంగుల అనురాగ్ స్కూల్‌ను 'తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ కె.శివరాంప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల తరగతి గదులను కలియతిరిగి వారితో ముచ్చటించారు. వారికి అందించే బోధనా పద్ధతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంఈ శివరాంప్రసాద్‌ను స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ శాలువాతో సత్కరించారు. గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌లోని 200 ఏళ్ల పురాతన ఈదమ్మ దేవాలయ అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందించి, ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్రసాగర్ అన్నారు. మంగళవారం ఈదమ్మ దేవాలయం గుడి కమిటీకి రూ.25,116ల విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. దేవాలయ పునర్నిర్మాణంలో పలు పంచుకున్న మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడురు శైలేష్‌రెడ్డి, సీతాల విజయ్‌లను సత్కరించారు. దేవాలయ కమిటీ సభ్యులు శంకర్‌గౌడ్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, గణేష్, నర్సింగ్ రావు, నరసింహ, నరేందర్, అల్లాడికృష్ణాయాదవ్, రవిగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ జోన్ బృందం: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులు, రైతులు, విద్యారంగానికి పెద్దపీట వేశారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబాలకు లాభం చేకూరేలా, వార్షిక ఆదాయం రూ.12 లక్షల లోపు ఉన్న ఉద్యోగులకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం అభినందనీయమన్నారు. రైతులకు ఎన్నో ప్రయోజనాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతి, నాయకులు రవి, కిషన్, సురేష్, మహేష్, నాగరాజ్, మహిళా నాయకురాలు నవనీత, యువమోర్చ నాయకులు బట్టికాడి విక్రమ్, నవీన్, మలిగే శ్రీకాంత్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో..


నాగారం మున్సిపాలిటీ పరిధిలో..